# బయటి వెలుగు

## అలిగే రామారావు



అర్థరాత్రి జానకమ్మగారికి నిద్రలో గుండెపోటు వచ్చింది. రెండురోజులుగా కురుస్తోన్న వర్షం.... ఎడతెరపి లేకుండా యింకా కురుస్తూనే వుంది. పైగా కరెంటు కూడా పోయింది. వూరంతా చిమ్మచీకటి. కోడలు వసుంధర తన ఛాతీకి అమృతాంజనం రాస్తోంది. అయినా నొప్పి తగ్గటంలేదు. రాను రాను ఎక్కువ అవుతూంది. వళ్లంతా చెమట్లు దిగజారుతున్నాయి. ఆమె భర్త కోదండరామయ్యగారు చేతిలో కొవ్వొత్తు పట్టుకొని కంగారుగా యిల్లంతా కలతిరుగుతున్నారు. ఏమీ చేయటానికి ఆయనకి తోచడంలేదు. ఆమెకు తక్షణం వైద్యసహాయం కావాలి. బయటికిపోటానికి వీల్లేదు. వురుములు మెరుపుల్తో వర్షం పడుతూనే వుంది.

ల్యాండ్‌లైన్ ఫోన్ పన్జేయటంలేదు. వర్షానికి టెలిఫోన్ కేబిల్స్ పాడైపోయాయి. సెల్‌ఫోన్ వుంది కాని ఏం చెయ్యాలి. ఫోన్జేయగానే అంబులెన్సులు వచ్చే వూరుకాదు ఇది. ట్యాక్సీలు కూడా దొరకవు.

సమయానికి కొడుకు కూడా వూళ్లోలేడు. ఆఫీసు డ్యూటీ మీద క్యాంపుకెళ్లాడు.

షెడ్డులో కొడుకు కారు వుంది కానీ ఆయనకు డ్రైవింగ్ రాదు; కోడలుకూ రాదు. ఇరుగు పొరుగు వాళ్లెవ్వరికీ కార్లు లేవు. నిస్సహాయ సంకట పరిస్థితి!

ఆయన కాలుకాలిన పిల్లిలాగా యిల్లంతా తిరుగుతున్నారు.

భర్త పడుతున్న ఆరాటం, కంగారూ చూస్తోంటే అంతబాధలోనూ తనకు ఆయన మీద జాలివేస్తోంది. ఉత్త పిచ్చిమారాజు. కోడలు మంచిదే కన్నకూతురు లాగా తనకు సేవ చేస్తోంది. తనకు వాంతి వస్తోందంటే వాష్‌బేషిన్ దగ్గరకు తీసికెళ్లింది.

కోడలు నోట్లో నాలికలేనిది. కొడుకు ప్రకాష్ తన మాటకెదురు చెప్పడు. భర్త సరేసరి! తన నోటికి జడిచి నోరు మెదపడు; అందరి నోళ్లూ తనే పెట్టుకొని యింట్లో చలాయించుకొస్తోంది... ఇప్పుడిలా తనకు ముంచుకొచ్చింది అర్థంతరంగా. ఎప్పుడూ రోగం నొప్పి తెలియనిది. రాయిలాగా వుండే మనిషి తను.

''అమ్మాయి, వసుంధరా! టార్చిలైటు యివ్వమ్మా! ఆటోలు దొరుకుతాయోమో బయటికెళ్లి చూచివస్తాను'' అన్నారు కో.రా. గారు.

''ఈ వర్షంలో చీకట్లో వెళ్లొద్దని చెప్పమ్మా! తెల్లవారాకా చూసుకోవచ్చు!'' అంది.

తన మాట తనకే వినిపించనంత నీర్సంగా మెల్లగా అంది.

''ఆమెకు ఏం తెలియదమ్మా! రేపొద్దుటి దాకా వుండే పరిస్థితి కాదు. ముందు నువ్వు లైటివ్వు!'' అన్నారు.

కోడలు లైటు తీసికొచ్చి యిస్తూ, ''రోడ్డు మీద గోతులూ గుంటలూ వుంటాయి. జాగ్రత్తగా వెళ్లండి మామయ్యగారు!'' అంది.

''గొడుగు తీసికెళ్లాండి!'' తను గొణిగింది.

''నువ్వు పడుకోవమ్మా తల్లీ! ఇప్పుడు కూడా నా గొడవే నీకు! అమ్మాయి, అత్తయ్యకు వేడివేడిగా కాసిని పాలు యివ్వు! అవి త్రాగి కాస్త కళ్లుమూసుకొని పడుకో జానకీ!'' అన్నారు.

ఇహ ఎటూ ఒకేసారి కన్ను మూయటం... ఈ నొప్పి తను భరించలేకపోతూంది. సమ్మెట్లతో కొట్టినట్లు వుంది. గుండె బిగపట్టేస్తోంది... ఇక నాపని అయిపోయినట్లేరా దేముడా... అనుకుంది.

కోడలు, ''మామయ్యగారూ! ఎవరయినా కారు డ్రైవింగ్ వచ్చిన వారు దొరుకుతారేమో చూడటం బెటర్!'' అంది...

ఇంట్లో ఎవరికైనా కారుడ్రైవింగ్ వచ్చి వుండటం బెటర్...అవును, ఈ మాట ఎవరో అనగా తను వినినట్లు వుంది... ఎవరు అంటారు?

ఇంకెవ్వరు, ఈ యింటి ఆసామి, తన జీవిత భాగస్వామి అన్నారు... ఆయన ఏది చెప్పినా దూర దృష్టితోనే చెబుతారు...,

తన్లో తాను గొణుక్కుంటూంది.


వేడివేడి పాలు రెండు గుటకలు పడేసరికి కళ్లు మగతగా మెల్ల మెల్లగా మూతలు పడతూ వున్నాయి... ఆ మగతలో ఏడెనిమిది నెలలు క్రితం జరిగిన సంఘటనలు ఒక్కొక్కటే దృశ్యమాన మవుతున్నాయి...

***

ఈ రిటైర్డ్ సీనియర్ ఆడిటర్ శ్రీమాన్ కోదండరామయ్యగారు ఎన్ని తలతిక్కపన్లు చేసినా, తిని తీరుబడిగా ఇంట్లో కూచుంటే ఎవరికైనా ఆ మాత్రం తిక్క తలకు ఎక్కుతుందిలే అని ఎలాగో సరిపెట్టుకుంది.

రిటైరయి వారం తిరక్కుండానే మార్నింగ్ వాకింగ్ మొదలుపెట్టారు. ఈ వయస్సులో మార్నింగ్ వాక్ మంచిదేలే అని తను సరే అంది. వాకింగ్‌కి కావాలంటూ పొట్టి నిక్కరూ, పట్టీల చారల టీ-షర్టులూ కొనుక్కున్నారు. ఇన్నేళ్లూ పొడుగు ఫ్యాంటులూ, లోపలికి దోపుకున్న చొక్కాలూ, ఆ ఆఫీసు డ్రెస్సులో విసిగిపోయివుంటారు. పొద్దే సరదా

కథ



పడుతున్నార్లే అని 'ఒకే' అంది తను.

వాకింగ్ బెస్సుగా వుండాలంటే యాక్షన్ షూస్ కావాలని తొమ్మిదివందలు పోసి కొన్నారు. ఇన్నేళ్లూ యాక్షన్-రియాక్షన్ లేకుండా ఎద్దులాగా గడిపేసిన మొద్దుమనిషి ఇలా అయినా యాక్టివ్‌గా వుంటారని తను 'సరే' అంది.

...కానీ, మరీ యింత ఓవర్ యాక్టివ్‌గా వుంటారని తనకేం తెల్సు!

ఈ వేషం చాలదన్నట్లు చేతిలో పట్టుకోవటానికి 'స్టిక్' కావాలంటూ కర్ర ముక్క ఒకటి కొన్నారు. కుక్కలు వెంటబడితే అదిలించటానికి చేతిలో అనువుగా వుంటుందని తను సర్లే అంది.

ఈ గురువుగారు ఏవంటూ ఈ మార్నింగ్ వాకింగ్ బిగిన్ చేశారోగానీ, యింటి మీదకు రోజుకొక తద్దినం తీసికొచ్చి పెడుతున్నారు.

మూడో రోజుకే, మూడేళ్ల పిల్ల ఎవరో తప్పిపోయి రోడ్డుమీద ఏడుస్తోందని వెంటబెట్టుకొచ్చారు. మరి కాసేపటికి పోలీస్ వేన్ ఈయన్ని వెతుక్కుంటూ వచ్చి యింటి ముందు ఆగింది. ఈ పిల్లతల్లి, ఎవరో ముసలోడు తన కూతుర్ని ఎత్తుకుపోయాడని పోలీసు కంప్లయింటు యిచ్చిందంట. ఈయనగార్ని జీప్ ఎక్కించుకొని పోలీసు స్టేషనుకు తీసుకుపోయారు. తీరా చూస్తే, ఈ పిల్లతల్లి పాలపేకెట్టు తీసుకురావటానికి ప్రక్క వీధిలోకి వెళ్లిందంట. ఈలోపల ఈ పిల్లబొంద నిదురలేచి ఏడస్తూ రోడ్డు మీదకు వచ్చి ఈ మానవతావాది గారి కంటపడింది. దాన్తో ఆ పిల్లను యింటికి తీసికొచ్చి, ఈయన పోలీసు స్టేషనుకు వెళ్లారు సంజాయిషీ చెప్పటానికి.

ఇది ఇలా అయిందా!

ఇంకోరోజు ఇంకో గోల!

పక్కనున్న అరవబస్తీలోని అరవ ఆడవాళ్లందరూ కట్టకట్టుకొని యింటిమీదకి దండెత్తి వచ్చారు.

అర్థంకాని అరవభాషలో అరవటం మొదలు పెట్టారు.

'ఈ ముస్సలోడు నీ మొడుడేనా? ఈయన మా పొట్టల మీద కొడుతున్నాడు. మీ పిల్లలను పన్లోంచి తీసేయమని

ఈ బజార్లో

వున్న టీ షాపులోళ్లకూ, బేకరీ వాళ్లకూ, పచారీ దుకాణాలవాళ్లకూ, చికెన్ సెంటర్ వాళ్లకూ నీ మొగుడు చెప్పి వచ్చాడంట! మేం ఆడమగా పిల్లాపెద్దా పన్లు చేయందే మాకు వూటగడవదు, పొట్ట నిండదు. మద్దిలో నీ మొగుడికేంటి నొప్పి?' అంటూ వాళ్లు దుమ్మెత్తి పోశారు.

బాలకార్మికుల చట్టం సో అండ్ సో సెక్షన్ క్రింద చిన్న పిల్లల్ని పన్లో పెట్టుకోవటం పెద్దనేరం! ఒక పౌరుడిగా దీన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత నామీద వుంది అంటూ ఈ సంఘసేవకుడుగారు ఉపన్యాసం మొదలుపెట్టారు.

తను ఈయన్ని వెనక్కిలాగి, వాళ్లకు ఒక దణ్ణం పెట్టి బ్రతిమాలి పంపించేసరికి తన తలప్రాణం తోకకు వచ్చింది.

అది అలా అయిందా!

మరో రోజు మరో తద్దినం!

పక్కకాలనీలో ఎవరో కొత్తగా యిల్లుకట్టుకుంటూ ప్రహరీగోడకు ఆగ్నేయంలో మెయిన్‌గేటు పెట్టా రంట. ఇది ఈ మార్నింగ్ వాకర్‌గారి దృష్టిలో పడింది.

'ఆగ్నేయంలో గేటు, యింటి యజమానికి తెర చిన మరణద్వారం!' అంటూ ఆయింటి ఆడవాళ్లకు భయంపెట్టి వచ్చారు ఈ వాస్తు సిద్ధాంతిగారు.

దాన్తో ఆ యింటి ఆసామి ఈ యింటి మీదకు దండెత్తి వచ్చాడు.

'నా స్థలానికి మూడు దిక్కులా యిళ్లున్నాయి. ఇక ఈ దిక్కే నాకు దిక్కు! మరి ఆగ్నేయంలో గేటు పెట్ట కుండా గోడకట్టుకొని, యింటిలోకి వెళ్లటానికి నన్ను గోడదూకి వెళ్లమంటావా? కాకపోయినా, రోడ్డున పోయేవాడివి రోడ్డున పోవాలి- నీ బోడి సలహాలు అడిగినోడికి చెప్పు!' అని బాగా కడిగేసి పోయాడు.

ఇదెక్కడి పీడాకారంరా అని తను తల పట్టుకొని కూచుంది.

''అమ్మా! నాన్నని ఆ చేసుకునే వాకింగ్ ఏదో మన డాబా మీద చేసుకోమను. ఈయన్ని మాత్రం బయ టికి పోనీయమాకు?'' అని తన కొడుకు చెప్పాడు.

ఈయన తన మార్నింగ్ వాకింగ్ మాత్రం మానలేదు; తన తలతిక్క పన్లూ ఆపలేదు.

ఈయన చేసిన ఈ నిర్వాకలన్నింటినీ పోన్లే చాదస్తం మనిషి అని ఎలాగో సరిపెట్టుకుంది తను. కానీ, ఈ రోజు ఈయన చేసిన ఈ పనిని మాత్రం అలా తేలిగ్గా సరిపెట్టుకోలేకపోతుంది; సహించలేక పోతూంది.

రోజూ వెళ్లినట్లే ఆ రోజు కూడా కో.రా.గారు వాకిం గ్‌కు వెళ్లారు. కానీ మామూలుగా వచ్చేటైంకు తిరిగి రాలేదు. జానకమ్మ తెగ కంగరూ పడిపోతూంది. ఇంట్లోకి గుమ్మంలోకి తిరుగుతూంది.

కోడలు వసుంధర, ''వాకింగ్‌లో ఎవరో కలిసివుం టార్లే అత్తయ్యా!'' అంది. తనని సమాధానపరచటానికి.

ఇంతలో యింటి ముందు కారుహారన్ మోత విని పించింది. తను వడివడిగా బయటికి వెళ్లింది.

ఇంటి ముందు కారు ఆగివుంది.

అది చూసి తనకు కంగారు ఎక్కువైంది. రోడ్డు మీద ఈయన కేదయినా అయిందా? దారినపోయే వాళ్లు చూసి కార్లో యింటికి తీసికొచ్చారా?

తన మనస్సు ఏదో కీడును శంకిస్తోంది...

ఇంతలో కారు ఫ్రంట్‌డోర్ తెరుచుకుంది. కో.రా. గారు క్రిందకు దిగారు.

కాలికి ఏదైనా బ్యాండేజి వుందా అని చూచింది. లేదు. కాలుగానీ మడత పడిందా? మనిషి కుంటటం లేదు. మరేమైంది?

ఈయన మాత్రం చిదానందంగా వున్నారు.

కారు ఎవరిదండీ అంది తను. కనిపించటం లేదా డ్రైవింగ్ స్కూల్ కారు అన్నారు. అప్పుడు చూచింది దానిమీది బోర్డు.

డ్రైవింగ్ నేర్చుకునేది ఎవరు?- నేనే-

మీకీ వయస్సులో డ్రైవింగా?- పోనీ నువ్వు నేర్చుకో!- నా మొహనికి అదొక్కటే తక్కువైంది!- నీకూ నాకూ ఎందుకోయ్? మన కోడలు వసుంధర నేర్చుకుంటుంది- మనవాడు ప్రకాష్‌కి డ్రైవింగ్ వచ్చుగా! పైగా వాడికి కారు కూడా వుందిగా?- అందుకేనోయ్! మన కోడలు కూడా నేర్చుకుంటుంది. పిల్లల్ను స్కూలుకి తీసికెళుతుంది. షాపింగ్‌కు వెళు తుంది...

దాంతో తనకు వళ్లు మండిపోతుంది; కోపం అరి కాలిలోంచి నడినెత్తికి పాకింది. ఆయన మీద గయ్ మంటూ లేచింది.

రయ్‌మంటూ కోడలు కార్లో బజార్లుకూ, షికార్లకు తిర్గుతుంటే తను దాసీ ముండలాగా అడ్డమైన చాకిరీ చేస్తూ కొంపలో పడివుండాలా? కోడలు ఇక తన మాట వింటుందా? ఇంట్లో తనకు విలువ వుంటుందా? తన నెత్తినెక్కి కూర్చోదూ? కోడళ్లను, ఎక్కడ వుంచేవాళ్లను అక్కడ వుంచాలి!... ఇవన్నీ తన మనస్సులో అనుకున్న మాటలు కావు. అందరికీ విని పించేటట్లు పైకి అన్నమాటలే! తనకేం భయం!

ఆమె నోటికి నుదురూ, బెదురూ లేదు. ఆ యింట్లో తన మాటకెదురులేదు!

''నువ్వు మరీ పాతకాలపు మనిషివోయ్ జాన కమ్మా! మోడరన్ థింకింగ్ వేరు. చెందురునిబోలు ముఖచందం వున్న చంచాలక్షులు కూడ చంద్రుని మీదకు దూసుకుపోతున్న కాలం ఇది! ఇంట్లో డ్రైవింగ్ వచ్చినోళ్లు వుండటం బెటర్...''

''ఇంకాపోండి మీ పోసుకోలు కబుర్లు! అస్సలు మీ అలుసు చూచుకునేగా ఇంట్లోవాళ్లు ఇలా విరగ బడిపోతున్నారు. మా కాలంలో మేం చేశామా, చూశామా ఈ షాపింగులూ, ఈ షికార్లూ! కారు డ్రైవింగ్‌లు కూడా నేర్చుకుంటే ఇక పట్టపగ్గాలుం డవ్... చూశారా చూశారా, నా మీద కోపంతో పిల్లల్ని ఎలా బాదుతుందో... నోరువిప్పి మాట అంటానికి భయం!...''

''డ్రైవింగ్ నేర్చుకోవడం నాకిష్టంలేదు. అత్తయ్య గారు నేర్చుకోమన్నా నేను నేర్చుకోను. ఆ కార్ను పంపించేయండి. మావయ్యగారూ!'' కోడలు కళ్లు తుడుచుకుంటూ అంది.

కొడుకు భోం చేయకుండా కోపంగా ఆఫీసుకెళ్లి పోయాడు.

ఆ రోజంతా తాను సాధించింది సాధించినట్టే వుంది...

***

ఆ రోజు జరిగినదంతా మళ్లీ యిప్పుడు గుర్తుకువ చ్చింది; అసలికే గుండెపోటుతో విలవిల్లాడిపోతున్న జానకమ్మగారికి గుండెకోత కలిగించింది.

ఆమె దీర్ఘంగా నిట్టూర్చింది. తను వుత్త మూర్ఖు రాలు అనుకుంది.

అంతలో భర్త పూర్తిగా వర్షంలో తడిచిపోయి వచ్చాడు.

''ఆటో దొరికిందా మావయ్యగారూ?'' వసుం ధర ఆదుర్దాగా అడిగింది.

''లేదమ్మా! మన పిచ్చిగాని ఈ టైంలో ఎవరుం టారు? అబ్బాయి సెల్‌కు ఫోన్‌చేశారు. అవుటాఫ్ కాలింగ్ ఏరియా అని వస్తోంది. ఇప్పుడేం చేయాలో నాకు బోధపడటం లేదు'' ఆయన దిగులుగా అన్నారు.

''అమ్మాయి! ఆయనికి పొడిబట్టలు యివ్వమ్మా! తల తుడుచుకోండి. జలుబుచేస్తుంది''

''ఈ స్థితిలో కూడా తన ధ్యాసే! నాకేం కాదులేవే! ఎందుకు జానకీ, యిప్పుడు కూడా నన్నేపిస్తావు?'' నుదురు కొట్టుకుంటూ బాధగా అన్నారాయన.

గుండెల్ని బద్దలు చేసుకుంటూ ఆకాశం ఘోషిం చింది... కోడలు యిచ్చిన పొడిబట్టలు కట్టుకొని ఆయన అసహనంగా యింట్లో అటూ ఇటూ తిరు గుతూ వున్నారు...

భర్త పడుతున్న టెన్షన్ చూస్తోంటే ఆమెకు ఆవేద నగా వుంది. ''ఏవండీ ఇటు రండీ! నా దగ్గర కూచోండి!'' నీర్సంగా పిలిచింది.

''ఏంటి చెప్పు జానకి! ఎలా వుంది? ఎలాగో వోర్చుకో! కాస్త తెల్లవారితే ఏదైనా చేయవచ్చు!''

ఆయన చేయి తనచేతిలోకి తీసుకుంది. నలభై ఏళ్ల క్రితం నలుగురిలో తను ఈయనికి సిగ్గుతో తల వంచుకొని చేయికలిపిన చేయి ఇది! ఇప్పుడు ప్రాణభీ తితో ఈయనికి దూరమైపోతున్నాననే భయంతో పట్టుకుంది.

''నేను బతకనండీ!... అంతా అయిపోయింది... నా ప్రాణాలు నిలవ్వు... నేను వుత్త మూర్ఖురాల్ను... ఆనాడు మీ మాట వినివుంటే...'' నీర్సంగా గొణు గుతూ వుంది.

ఆమె ఏమంటుందో ఆయనకర్థం కాలేదు... ఆమె చేయి పట్టుజారిపోతూంది... మెల్లమెల్లగా అపస్మారక స్థితిలోకి జారిపోతోంది...

ఇంతలో యింటిబయట కారు హారన్ మోత విని పించింది...

***

జానకమ్మగారు స్పృహలోకి వచ్చి మెల్లమెల్లగా కళ్లు విప్పి చూచేసరికి తను ఆసుపత్రి బెడ్ మీద వుంది.

తనని డాక్టరుగారు చెక్‌చేస్తూ వున్నారు. తన భర్త, కొడుకూ, కోడలూ, మనవడూ తన మంచం చుట్టూ నిలబడివున్నారు.

''నో ప్రాబ్లమ్. షీ ఈజ్ నౌ అవుటాఫ్ డేంజర్'' కార్డియాలజిస్టు చీఫ్ డా. ఆంజనేయశర్మగారు అన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చెప్పి డాక్టరు వెళ్లిపోయారు. కో.రా. గారు, ''జానకీ! మన కోడలు వసుంధరే నిన్ను బతికించింది. అర్ధరాత్రి ఆ చీకట్లో, ఆ వర్షంలో ధైర్యంచేసి కారు డ్రైవు చేసుకుంటూ నిన్ను ఆసుపత్రికి తీసుకువచ్చింది. ఏ మాత్రం కాస్త లేటయినా నీవు దక్కివుండేదానవు కాదని డాక్టర్లం దరూ అన్నారు'' జానకమ్మగారు కోడలు వంక ఆశ్చ ర్యంగా చూచింది.

''అవును వసుధా! నీకు కారుడ్రైవింగ్ వచ్చా? నాక్కూడా ఎప్పుడూ చెప్పలేదే!'' ప్రకాష్ అన్నాడు.

''మొన్న వేసవికాలం సెలవుల్లో హైదరాబాదుకు వెళ్లినప్పుడు నాన్నగారు డ్రైవింగ్ నేర్పించారు...'' బెరుగ్గా అంది.

జానకమ్మగారు ఆప్యాయంగా, కృతజ్ఞతా పూర్వ కంగా కోడలు చేతిని తన చేతిలోకి తీసుకుంది. కను కొలల్లోంచి కన్నీరు జాలువారగా కోడలు వంక ప్రేమగా చూచింది. అంతలో నర్స్ వచ్చి కిటికీ తెర లను ప్రక్కకి తొల్గించింది. బయటి వెలుగు ఆమె మొహంమీద పడుతూంది...

*